క్లుప్తంగా

పంచాయతీ కార్మికులకు సబ్బులు పంపిణీ



పెనమలూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు, పెనమలూరు గ్రామ పంచాయతీ సర్పంచి లింగాల భాస్కరరావు గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సబ్బులు పంపిణీ చేశారు. పంచాయతీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 58 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒకో కార్మికుడికి 12 సబ్బులు, లీటరు కొబ్బరి నూనె, సంతూర్ సబ్బులు రెండు, ప్యాకెట్ బెల్లం పంపిణీ చేశారు. సర్పంచి భాస్కరరావు త్వరలో కార్మికులకు దుస్తులు కూడా పంపిణీ చేస్తామని చెప్పారు.

వైఎస్సార్ సీపీ క్రియాశీల కార్యకర్తలకు దుస్తులు అందజేత



పెనమలూరు: రంజాన్ పండుగ సందర్భంగా కానూరులో వైఎస్సార్ సీపీ క్రియాశీల కార్యకర్తలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి దుస్తులు పంపిణీ చేసినట్టు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చాన్‌బాషా ఆదివారం తెలిపారు. పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా కానూరు సనత్‌నగర్‌కు చెందిన ముస్లిం మైనార్టీకి చెందిన వైఎస్సార్‌సీపీ క్రియాశీల కార్యకర్తలు 50 మందికి నూతన వస్త్రాలు, స్వీట్లు, రంజాన్ తోఫాను ఎమ్మెల్యే పార్థసారథి వితరణగా అందజేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు ఖాదర్, పఠాన్ అహ్మద్, సైదు అహ్మద్, జాఫర్‌ఖాన్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

గన్నవరం: స్థానిక గ్రామసచివాలయం–1 పరిధిలోని రాయ్‌నగర్ ప్రాంతంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఆదివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నీలం ప్రవీణ్‌కుమార్, సచివాలయాల మండల కన్వీనర్ కైలే శివకుమార్ నేతృత్వంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు.

నేడు అవార్డులు ప్రదానం

ఉంగుటూరు:జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 24న మండల పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన గ్రామాలకు మండల స్థాయిలో అవార్డులను బహూకరించనున్నట్లు ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆదివారం ఎంపీడీవో మాట్లాడుతూ ఎంపీపీ సరోజిని అధ్యక్షతన సమావేశం నిర్వహించి అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఆరోగ్యకరమైన పంచాయితీ విభాగంలో చాగంటిపాడు, పెద అవుటపల్లి, తరిగొప్పల. నీటి సమృద్ధితో మౌళిక సదుపాయాలుగల పంచాయితీ విభాగంలో ఎలుకపాడు, తేలప్రోలు, ఉంగుటూరు. స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలుగల విభాగంలో ఉంగుటూరు, ఆత్కూరు, వెల్దిపాడు. సామాజిక భద్రత కలిగిన గ్రామాలు ఆముదాలపల్లి, గారపాడు, కొయ్యగూరపాడు. పేదరికంలేని, మెరుగైన జీవనోపాధుల గ్రామాలు తేలప్రోలు, చాగంటిపాడు, నాగవరప్పాడు. సుపరిపాలన కలిగిన గ్రామాలు వెల్దిపాడు, మానికొండ, ఆత్కూరు. పిల్లల స్నేహపూర్వక గ్రామలు తేలప్రోలు, ఆత్కూరు, కొయ్యగూరపాడు. పరిశుభ్రమైన, హరిత గ్రామాలు కొయ్యగూరపాడు, తుట్టగుంట, వెన్నూతల. మహిళా స్నేహపూర్వక గ్రామాలు కొయ్యగూరపాడు, గారపాడు, వెల్దిపాడు గ్రామాలను ఎంపిక చేసినట్లు ఎంపీడీవో వివరించారు. ఆయా గ్రామాలకు 9 విభాగాల అవార్డులు అందజేస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యదర్శులు, గ్రామ స్థాయి అధికారులు, సీనియర్ ప్రజా కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

గాయపడ్డ మహిళ చికిత్స పొందుతూ మృతి

కంకిపాడు: ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించి గాయపడ్డ మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. అదనపు ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాల మేరకు...మండలంలోని కోలవెన్ను గ్రామానికి చెందిన కె.భవాని (49) ఈనెల 15న ఇంట్లో పూజ చేసుకుంటుండగా హారతి ప్రమాదవశాత్తూ చీరకు అంటుకుని మంటలు వ్యాపించాయి. కుటుంబ సభ్యులు వెంటనే గుర్తించి మంటలను అదుపుచేసి వైద్యం నిమిత్తం విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఆమె మృతి చెందింది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ లక్ష్మి తెలిపారు.

ప్రగతిపథంలో గోసాల పంచాయతీ



సచివాలయ భవనం



సుందరంగా ఏర్పాటుచేసిన పార్కు



వైఎస్సార్ హెల్త్ క్లినిక్



సీసీ రోడ్డు

- రూ.2.69 కోట్లతో అభివృద్ధి పనులు
- లబ్ధిదారులకు రూ.34.16 కోట్ల ఆర్థిక సాయం
- 430 మంది పేదలకు ఇళ్ల స్థలాలు



రైతు భరోసా కేంద్రం

పెనమలూరు: గోసాల గ్రామ పంచాయతీ ప్రగతిపథంలో పయనిస్తోంది. గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో లబ్ధిదారులకు కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గోసాల గ్రామ పంచాయతీ వార్షిక ఆదాయం రూ.50 లక్షల లోపే ఉంటుంది.అయితే రాష్ట్ర ప్రభుత్వం నిధులు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సహకారంతో గ్రామంలో గత మూడు సంవత్సరాలలో గణనీయమైన అభివృద్ధి జరిగింది. గ్రామంలో భవనాలు, రోడ్లు, డ్రైనేజీలు, షాదీఖానా తదితర అభివృద్ధి పనులకు ఇప్పటివరకు రూ.2.69 కోట్ల మేరకు అభివృద్ధి పనులు చేశారు.

రూ.1.35 కోట్లతో భవనాల నిర్మాణం

గ్రామంలో ప్రజల అవసరాలకు రూ.1.35 కోట్లతో శాశ్వత భవనాలు నిర్మాణం చేశారు. గ్రామంలో సుపరిపాలనకు రెండు గ్రామ సచివాలయాల భవనాలు నిర్మాణం చేశారు. ప్రధాన గ్రామంలో రూ.32 లక్షలతో సచివాలయం–1 భవనం, వేణుగోపాలస్వామి నగర్‌లో రూ.45 లక్షలతో సచివాలయం– 2 భవన నిర్మాణం చేసి పాలనను ప్రజల చేరువకు తీసుకు వచ్చారు. రైతు భరోసా కేంద్రం భవనం రూ.21 లక్షలతో నిర్మించారు. రూ.37 లక్షలతో రెండు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మాణం చేశారు. ప్రస్తుతం ప్రాథమిక వైద్య సేవలు అందుతుండగా త్వరలో పూర్తి స్థాయి వైద్య సేవలు అందనున్నాయి.

శరవేగంగా అభివృద్ధి పనులు

గోసాల గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో ఇప్పటివరకు రూ.1.34 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేయగా త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడానికి గ్రామ పంచాయతీ ప్రణాళిక సిద్ధం చేసింది. గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికల అభివృద్ధి, పార్కు నిర్మాణం, మంచినీటి పైప్‌లైన్లు, బోర్లు నిర్మాణం చేశారు. రూ.30 లక్షలతో పేద ముస్లిం మైనార్టీలకు షాదీఖానా నిర్మాణం చేశారు.

430 మంది పేదలకు ఇళ్ల స్థలాలు

రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా గ్రామంలో లబ్ధిదారులకు రూ 34.16 కోట్ల ఆర్థిక సాయం అందించింది. గ్రామంలో ఎప్పుడూ లేని విధంగా 430 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. గ్రామంలో అన్నివర్గాల ప్రజలకు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేసి అత్యంత పారదర్శక పాలన అందిస్తున్నారు.

అన్ని మౌలిక వసతులు కల్పించాం



ఎమ్మెల్యే పార్థసారథి సహకారంతో గ్రామంలో అన్ని మౌలిక వసతులు కల్పించాం. ప్రభుత్వ భవనాలు అన్నీ నిర్మాణం పూర్తి చేశాం. ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేస్తున్నాం.

–సంగెపు శ్రీనివాసరావు,
సర్పంచ్, గోసాల గ్రామ పంచాయతీ

నేడు మండల కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎల్.వి శేషగిరిరావు తెలిపారు. ప్రధానమంత్రి రాజస్థాన్ రేవా గ్రామం నుంచి ప్రసంగించే రిలే కార్యక్రమాన్ని అన్ని పంచాయతీ కార్యాలయాల్లో వీక్షించే ఏర్పాటు చేసుకోవాలన్నారు. వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ప్రథమ, ద్వితీయ, తృతీయ పంచాయతీలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు,ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

నల్లమోతు కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

గన్నవరం: ఇటీవల మృతి చెందిన స్థానిక ఎస్సీ కాలనీ వైఎస్సార్ విగ్రహ స్థాపకుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నల్లమోతు యేసు కుటుంబ సభ్యులను ఆదివారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ పరామర్శించారు. యేసు మృతి పట్ల ఆతని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మహానేత వైఎస్సార్‌కు యేసు వీరాభిమాని. వైఎస్సార్ మరణం తర్వాత గన్నవరంలో మొట్టమొదటి వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. తొలుత యేసు చిత్రపటానికి ఎమ్మెల్యే వంశీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఎలిజబెత్‌రాణి, మండల పార్టీ అధ్యక్ష, కన్వీనర్లు పడమట సురేష్, నీలం ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి, ముస్తాబాద పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు మేచినేని బాబు, పార్టీ నేతలు గొన్నూరు సీమయ్య పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి బాసటగా నిలవాలి

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



చిన ఓగిరాలలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: సంక్షేమ ప్రభుత్వానికి బాసటగా నిలిచి సీఎం జగన్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని చిన ఓగిరాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే పార్థసారథి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పాలన వివరించి, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధితో రూపొందించిన సంక్షేమ బ్రోచర్లను పంపిణీ చేశారు. స్థానికులు రహదారులు అభివృద్ధి చేయాలని, డ్రెయిన్లు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. సంక్షేమ పథకాలు అన్నీ నేరుగా అందుతున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా పథకాలను అమలు చేసి పాలనలో పారదర్శకత తీసుకొచ్చారన్నారు. దేశంలో వివిధ రాష్ట్రాల్లో అమలు చేయని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయన్నారు. దేశం యావత్తూ సీఎం జగన్ సంక్షేమ పాలన వైపు చూస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్ర రాజకీయాలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ యార్లగడ్డ సాయి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు పాలడుగు భాస్కరరావు, మంచిగంటి నాగేశ్వరరావు, మత్తె ఉదయభాను, మంచిగంటి రమేష్, జి.సాంబశివరావు, దోనేపూడి శ్రీహరి, కొడాలి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముసురు.. ఆందోళనలో రైతులు



కంకిపాడు బైపాస్ వెంబడికి చేర్చుతున్న ధాన్యం

కంకిపాడు: ముసురుతో రైతుల్లో ఆందోళన నెలకొంది. చేతికొచ్చిన పంటను ఎక్కడ నోటికి దక్కకుండా చేస్తుందోనని అన్నదాతలు వణికిపోతున్నారు. ద్రోణి ప్రభావంతో ఆదివారం వాతావరణం ఒక్కసారిగా మారింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఓ మోస్తరు జల్లులు కురిశాయి. నియోజకవర్గంలోని ఉయ్యూరు, కంకిపాడు పరిసరాల్లో చిరుజల్లులు నుంచి మోస్తరు వర్షం పడింది. రబీ సీజన్ చివరి దశకు చేరుతోంది. వరి ధాన్యం మార్కెట్‌కు చేర్చే పనిలో రైతులు ఉన్నారు. బోర్లు, నీటి సదుపాయం ఉన్న పంట పొలాల్లో రైతులు ఈ దఫా వరి సాగు చేశారు. పంట చేతికి రావటంతో వరి కోత యంత్రాలతో కోత కోయించి ధాన్యాన్ని ఖాళీ ప్రదేశాలకు తరలిస్తున్నారు. మొక్కజొన్న, పసుపు పంటలను ఎండబెట్టి మార్కెట్‌లో విక్రయించేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ తరుణంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటం, మోస్తరు వానలు పడటంతో పంట నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండబెట్టిన పంట వర్షానికి దెబ్బతినకుండా పరదాలు, టార్పాలిన్‌లు కప్పి పంటను సంరక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు.

అలరించిన నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఖమ్మానికి చెందిన అభినయ రుద్ర నాట్యాలయానికి చెందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులకు విశేషంగా ఆకట్టుకుంది. ధర్మపథం కార్యక్రమంలో ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని కళావేదికపై పలువురు కళాకారులు భరత నాట్య ప్రదర్శన ఇచ్చారు. సుమారు 20 మంది నృత్య ప్రదర్శన చేశారు. కళాప్రదర్శన అనంతరం అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



గన్నవరం: కొంత కాలంగా గన్నవరం ప్రాంతంలో తిరుగుతూ దోపిడీలకు పాల్పడుతున్న అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గన్నవరం సీఐ పి. కనకరావు సూచించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ...బంగారం మెరుగు పెడతామని, పిల్లలు లేనివారికి సంతానం కోసం మందులు ఇస్తామని మాయమాటలు చెప్పి కొంత మంది మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. స్థానిక పాతగన్నవరంలో గత శుక్రవారం బంగారం మెరుగు పెడతామని ఇరువురు వ్యక్తులు ఓ వృద్ధురాలిని మోసగించి 15 కాసుల ఆభరణాలను దోచుకుపోయారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇలాంటి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులు చెప్పే మాయమాటలు నమ్మవద్దని, జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ తరహా నేరాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిస్తే వెంటనే 9440627041, 9440627042 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ తరహా నేరాల నియంత్రణ కోసం పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద ప్రమాదం



కంకిపాడు: కారును టిప్పరు లారీ ఢీకొన్న సంఘటన మండలంలోని ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం...ప్రొద్దుటూరు అడ్డరోడ్డు వద్ద కారును ఉయ్యూరు నుంచి వస్తున్న టిప్పరు లారీ ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న వృద్ధుడు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ప్రమాదంతో విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై ట్రాఫిక్ నెలకొంది. స్థానికులు, పోలీసులు స్పందించి ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం



స్వామివారి కల్యాణం జరుపుతున్న వేదపండితులు

గన్నవరం:కృష్ణనగర్‌లోని గోవిందమాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం అష్టమ వార్షికోత్సవం, ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామికి శాంతి కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అంబుల సత్యనారాయణ, కార్యదర్శి పుట్టా రాంబ్రహ్మం, సంయుక్త కార్యదర్శి విశ్వనాధుల శేషచారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి వజ్రాల రాంబాబు, సంఘ నాయకులు రాపాక వెంకటచారి, పుట్టా సర్వేశ్వరరావు, నందిగామ నవరత్నాచారి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పుస్తకాలను పంపిణీ చేస్తున్న ధనేకుల ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రావి సురేష్‌బాబు

కంకిపాడు: పుస్తక పఠనం అలవర్చుకోవాలని ధనేకుల ఇన్‌స్టిట్యూట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రావి సురేష్ బాబు సూచించారు. ఈడుపుగల్లులో వరల్డ్ బుక్ డే సందర్భంగా ఆదివారం పుస్తకాలను పంపిణీ చేశారు. రావి సురేష్‌బాబు మాట్లాడుతూ పుస్తక పఠనంతో విజ్ఞానం పెంపొందుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు.

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ పెనమలూరు సెక్షన్‌లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. దీని కారణంగా పోరంకిలో మహాలక్ష్మినగర్, వసంతనగర్, ఆర్టీసీకాలనీ, లక్ష్మీపురం కాలనీ, నిడమానూరు రోడ్డు, రాజమాత నగర్, పద్మనాభపురం కాలనీ, నారాయణపురంకాలనీ, కృష్ణాపురంకాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

ఘనంగా శ్యామశాస్త్రి జయంతి

విజయవాడ కల్చరల్: కర్నాటక సంగీత త్రిమూర్తుల్లో ఒకరైన శ్యామశాస్త్రి 262 జయంతి వేడుకలను ఆదివారం శ్రీ సుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన సత్యనారాయణపురంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్, మల్లాది కార్తీక త్రివేణి, వేమూరి విశ్వనాథ్, లయ విద్వాంసులు కార్తికేయ ఆదినారాయణ, పారుపల్లి సుబ్బరాయ ఫల్గుణ్, సద్గురు చరణ్‌తోపాటు పలువురు యువ సంగీత కళాకారులు, సుబ్రహ్మణ్య సంగీత సమితి విద్యార్థులు శ్యామశాస్త్రి కీర్తనలను మధురంగా ఆలపించారు. ఆకాశవాణి టాప్ గ్రేడ్ ఆర్టిస్ట్ మోదుమూడి సుధాకర్ కర్నాటక సంగీతానికి శ్యామశాస్త్రి చేసిన సేవలను వివరించారు. సంగీత సమితి నిర్వాహకులు చిట్టా విశ్వేశ్వరరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

26 ఏళ్ల తర్వాత ఆత్మీయ కలయిక



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడులోని జీఎస్ఆర్ఎంయూపీ స్కూల్ 1996–97లో ఏడో తరగతి విద్యార్థులు 26 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలలో ఆడారు. పాడారు. అల్లరి చేశారు. జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సందడి చేశారు. వారు చదువుకున్న పాఠశాలలో కూర్చుని స్నేహితులతో ఉల్లాసంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఆనందంగా గడిపారు. పూర్వ విద్యార్థులు దుర్గారావు, దుర్గాణి, నాగలక్ష్మి, మేరీ, రాజేంద్ర, బి.శ్రీనివాస్, వినయ్, రవి తదితరులు పాల్గొన్నారు.

వర్షితప్ ముగింపు ఉత్సవం

- భారీగా తరలివచ్చిన జైనులు
- పాతబస్తీ జైన ఆలయాల్లో ప్రత్యేక పూజలు



దీక్షలను విరమింపజేస్తున్న కుటుంబ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జైనులు పవిత్రంగా భావించే వర్షితప్ దీక్షల ముగింపు ఉత్సవం ఆదివారం ముగిసింది. ఏడాది కాలంగా జైన ఆచారం ప్రకారం వర్షితప్ పేరుతో కొనసాగిస్తున్న ఉపవాసదీక్షలను వారి ప్రత్యేక కార్యక్రమాల నడుమ విరమించారు. పాతబస్తీలోని శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్ సంఘ్ ఆధ్వర్యాన రెండు రోజుల ఉత్సవంలో భాగంగా స్థానిక ఎస్ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో సామూహికంగా ఉపవాస దీక్షల విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దీక్షలను ఆచరించిన వారికి ప్రత్యేక సింహాసనం వంటి ఆసనాలు ఏర్పాటు చేసి వారికి చెరుకు రసాన్ని అందించారు. కార్యక్రమంలో వారి బంధువులు భారీగా తరలిరావటంతో లోపలకు వెళ్లేందుకు ప్రత్యేక పాస్‌లను జారీ చేసి వారిని మాత్రమే అనుమతించారు. సంఘ్ అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా మాట్లాడుతూ జైన సంప్రదాయంలో పలు సందర్భాల్లో ఉపవాసదీక్షలను ఆచరిస్తారన్నారు. ఆ క్రమంలో వర్షితప్ చాలా గొప్ప దీక్షగా తమ పెద్దలు చెబుతారన్నారు. రెండో రోజు ఉత్సవానికి పదిహేను వేల మంది జైనులు హాజరైనట్లు వివరించారు.

సమాజానికి జైన ధర్మం అవసరం

ప్రస్తుత సమాజానికి జైన ధర్మం చాలా అవసరమని ప్రముఖ జైనగురువు పరమపూజ్య అభినందన్ చంద్రసాగర్ అన్నారు. ఆదివారం సాయంత్రం జరిగిన ప్రవచన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో శాంతి వర్ధిల్లాలంటే జైన మత ధర్మాన్ని అనుసరించడం చాలా అవసరమన్నారు. జైనంలో ఉపవాసానికి చాలా ప్రాముఖ్యత ఉందన్నారు. విజయవాడ వంటి నగరంలో వందలాది మంది దీక్షను ఆచరించటం ఆనందాన్ని కలిగించిందన్నారు. నిర్వాహకులను అభినందించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

పాతబస్తీలోని పలు జైన ఆలయాల్లో అక్షయతృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని విశేష వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. వట్టూరి వారి వీధిలోని జైన మందిరంలో జైన ప్రథమ తీర్థంకురుడు ఆదినాథ్‌ప్రభుజీ విగ్రహానికి చెరుకురసంతో ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమాలను సంస్థ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్ బోడోతరియా, ప్రధాన కార్యదర్శి పన్నాలాల్ జైన్ ఉపాధ్యక్షులు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, సహాయక కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహ కోశాధికారి రాహుల్ జైన్ తదితరులు పర్యవేక్షించారు.